సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 20 । మార్చి । 2024



సోమశిలలో 11.82 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 11.82 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 2450 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.67,580
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,069
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,251
నవర (8 గ్రాములు)	రూ.50,008

గరిష్ఠం/కనిష్ఠం
35.0 /25.0

వాతావరణం


గాలిలో తేమ 67 శాతంగా మంగళవారం నమోదైంది. ఉష్ణోగ్రతల్లో బుధవారం పెద్దగా మార్పు ఉండబోదని వాతావరణ అధికారులు తెలిపారు.



గ్లాసును అటకెక్కించారు

- నారాయణ తీరుతో కకావికలం
- జనసేన కార్యకర్తలు, నేతలను దూరం పెట్టిన వైనం
- ఓ కాపు నేతను వెంటేసుకొని కేడర్ తన వెంటే ఉందంటూ షో
- పత్తాలేని జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి





అధికారమే పరమావధిగా ఏర్పడిన టీడీపీ, జనసేన కూటమిలో లుకలుకలు అప్పుడే స్టార్టయ్యాయి. జనసేన నిర్వీర్యమే లక్ష్యంగా టీడీపీ నెల్లూరు నగర అభ్యర్థి నారాయణ తన రాజకీయ వ్యూహంతో పావులు కదుపుతుండగా, ఈ యత్నాలు సక్సెసయ్యాయి. ఆ పార్టీ నాయకులతో పాటు చిరంజీవి అభిమాన సంఘ నేతలనూ దూరం పెడుతున్నారు. తన కాంపౌండ్‌లోని ఓ చోటా నేతను ఆ పార్టీలోకి పంపి.. ఆయనే కీలక వ్యక్తిగా చూపించి.. ఓ బలమైన సామాజికవర్గానికి చెందిన నేతలకు ప్రాధాన్యం లేకుండా చేశారు.

క్రమక్రమంగా దూరం

తన సొంత నిధులను పెద్ద మొత్తంలో వెచ్చించి పార్టీ కేడర్‌ను మనుక్రాంత్‌రెడ్డి పెంచుకుంటూ వచ్చారు. నగర నియోజకవర్గ పరిధిలో డివిజన్ల వారీగా జనసేన కార్యాలయాలను తెరిచి ప్రచారం చేసుకున్నారు. అయితే పొత్తులో భాగంగా నెల్లూరు సిటీని టీడీపీకి కేటాయించడంతో రూరల్ స్థానం నుంచి పోటీ చేసేందుకు నిధులను నారాయణ సమకూర్చుతారంటూ బుజ్జగించారు. అయితే అక్కడా ఆయనకు సీటు లభించలేదు. అయినా పార్టీ ఆదేశాల మేరకు టీడీపీ కోసం పనిచేస్తుండగా.. నారాయణ క్రమక్రమంగా దూరం పెట్టారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో జనసేన పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మారిన రాజకీయ పరిస్థితులతో ఆ పార్టీకి జిల్లాలో సీట్ల కేటాయింపులో టీడీపీ రిక్తహస్తం చూపింది. మరోవైపు టీడీపీ నెల్లూరు నగర అభ్యర్థి నారాయణ తన పోకడలతో ఆ పార్టీని ఖాళీ చేయిస్తున్నారు. జిల్లాలో జనసేన అంటే మనుక్రాంత్‌రెడ్డే గుర్తొచ్చేవారు. ఆవిర్భావం నుంచే పార్టీలో ఉంటూ జిల్లా బాధ్యతలను తన భుజస్కంధాలపై మోశారు. జిల్లాలో పార్టీ కార్యక్రమాలు.. రాష్ట్రస్థాయి వ్యవహారాల్లో ఆర్థికంగా చేయూతనిచ్చేవారు. జిల్లాలో పార్టీకి బలమైన కేడర్ లేకపోయినా అందులోనే ఉంటూ.. తనకు పార్టీ ద్వారా ఏదో రోజు సరైన గుర్తింపు, ప్రాధాన్యం లభిస్తుందని ఆశించారు. పొత్తులో భాగంగా జిల్లాలో ఒక సీటును జనసేనకు కేటాయిస్తే.. అది తనకే లభిస్తుందని ధీమాగా ఉన్నారు.

అంతా.. వారే..!

తన సామాజికవర్గానికి చెందిన క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వ్యక్తిని జనసేనలోకి నారాయణ రెండేళ్ల క్రితం పంపారు. రాష్ట్ర స్థాయిలో వేములపాటి అజయ్‌కుమార్‌కు దగ్గర చేశారు. ముఖ్య అనుచరుడిగా ఉన్న చోటా నేత ద్వారా మరో కుంపటి పెట్టించి రాజకీయ కార్యకలాపాలను చేయసాగారు. ఇదంతా ఓ ఎత్తయితే.. ఎన్నికల వేళ మనుక్రాంత్‌ను పూర్తిగా పక్కన పెట్టేసి తన సామాజికవర్గానికి చెందిన వ్యక్తినే తెరపైకి తీసుకొచ్చారు. దీనికి వేములపాటి వెనుక నుంచి అధిష్ఠానం ద్వారా గ్రీన్‌సిగ్నల్ ఇప్పించారు. జిల్లాలో జనసేన అంటే ఆ చోటా నేతే అనే తరహాలో బిల్డప్ ఇచ్చారు.

పరిచయ కార్యక్రమాల్లోనూ అంతే..

నెల్లూరు సిటీ, కోవూరు నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థులతో జనసేన పరిచయ కార్యక్రమాలను ఇటీవల నిర్వహించారు. అయితే ఇందులోనూ జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమాన సంఘ నేతలు కనిపించలేదు. వేములపాటి అజయ్‌కుమార్, గునుకుల కిశోరే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాస్తవానికి ఆ కార్యక్రమానికి వచ్చిన వారంతా టీడీపీ కార్యకర్తలే కావడం విశేషం.

గత అనుభవాల నేపథ్యంలో..

గత ఎన్నికల్లో తన ఓటమికి ఓ సామాజికవర్గమే కారణమని భావిస్తున్న నారాయణ.. తాజాగా జరగనున్న ఎన్నికల్లో తన కార్యకలాపాల్లో వారిని దూరం పెట్టేశారు. గత ఎన్నికల్లో టీడీపీ నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు డబ్బులు పంచకపోవడంతోనే తాను ఓటమి పాలయ్యాయని తన అనుచరుల వద్ద వాపోయారని తెలుస్తోంది. రానున్న ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని భావించిన నారాయణ.. ఆ సామాజికవర్గాన్ని పూర్తిగా పక్కనబెట్టేశారనే ప్రచారం జరుగుతోంది.

అభిమాన సంఘాలకు చోటేదీ..?

చిరంజీవి, పవన్ కల్యాణ్ అభిమాన సంఘాల నేతలు, జనసేన క్యాడర్ టీడీపీ ప్రచార కార్యక్రమాల్లో ఎక్కడా పాల్గొన్న దాఖలాల్లేవు. టీడీపీ నేతలతోనే జనసేన జెండాలను గునుకుల కిశోర్ మోయించి.. ప్రచారం చేయిస్తున్నారని అభిమాన సంఘాల నేతలు వాపోతున్నారు.

సంకెళ్లే.. తాళాలు



ఈ చిత్రం చూసి కటకటాల్లో ఎవరైనా గజదొంగ ఉన్నారనుకుంటే అది పొరపాటే. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ప్రశ్నపత్రాలను గదిలో ఉంచి కటకటాలకు తాళం బదులు సంకెళ్లు వేసిన దృశ్యం కొండాపురం పోలీస్‌స్టేషన్లో కంటపడింది. కాగా తాళాల్లేకపోవడంతో సంకెళ్లను వేయాల్సి వచ్చిందని సిబ్బంది బదులిచ్చారు.

– కొండాపురం

ఉమ్మడి రాజధానిగా మరో పదేళ్లు హైదరాబాదే ఉండాలి

- హైకోర్టులో పిల్

మనుబోలు: తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను మరో పదేళ్ల పాటు కొనసాగించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశామని మనుబోలు మండలం అక్కంపేటకు చెందిన మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రానికి ఇంత వరకూ శాశ్వత రాజధాని లేదని, నిధుల విడుదల, ఉమ్మడి ఆస్తుల విభజన పూర్తిగా జరగలేదన్నారు. జూన్ రెండుతో ముగియనున్న హైదరాబాద్ ఉమ్మడి రాజధాని కాలపరిమితిని మరో పదేళ్లు పొడిగించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిల్‌లో కోరానని చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి వద్ద వాదనలు బుధవారం జరగనున్నాయని, రాష్ట్ర భవిష్యత్తు, యువత కోసం పిల్‌ను దాఖలు చేశానని ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

పరీక్షలకు 943 మంది గైర్హాజరు



పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ

నెల్లూరు (టౌన్): పదో తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 943 మంది విద్యార్థులు మంగళవారం గైర్హాజరయ్యారు. హిందీ పరీక్షను నిర్వహించగా, రెగ్యులర్‌కు సంబంధించి 28,280 మందికి గానూ 27,722 మంది హాజరయ్యారు. ప్రైవేట్‌కు సంబంధించి 490 మందికి గానూ 385 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని 176 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. మూలాపేటలోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, ఏనుగు సుందరరామిరెడ్డి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను కలెక్టర్ హరినారాయణన్ తనిఖీ చేశారు. పది కేంద్రాల్లో జిల్లా అబ్జర్వర్ మువ్వా రామలింగం తనిఖీలు చేపట్టారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నేడు ప్రారంభం



మాట్లాడుతున్న సేతు మాధవన్

నెల్లూరు(దర్గామిట్ట): జొన్న, మొక్కజొన్న సేకరణకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లాలో బుధవారం ప్రారంభించనున్నామని జేసీ సేతు మాధవన్ పేర్కొన్నారు. కొనుగోలు కమిటీ సభ్యులతో తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల మేరకు జొన్న పంట క్వింటాల్‌కు రూ.3180, మొక్కజొన్న పంట క్వింటాల్‌కు రూ.2090 మేర కనీస మద్దతు ధరగా ప్రకటించామని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో మార్కెట్ ధర కనీస మద్దతు ధర కన్నా తక్కువగా ఉంటే మార్క్‌ఫెడ్ ద్వారా జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. జొన్న, మొక్కజొన్న రైతులు సీఎం యాప్ లేదా రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి ఏప్రిల్ ఐదు వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. మార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింఛనర్ల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న గౌస్

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని ప్రభుత్వ పింఛనర్ల సంక్షేమ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్సెమ్ గౌస్ మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెండు డీఆర్‌లను అమలు చేశారని చెప్పారు. గుంటూరులో నిర్వహించిన సంఘ రాష్ట్ర వార్షిక సర్వసభ్య సమావేశంలో ఉపాధ్యక్షుడిగా కావలికి చెందిన రమణయ్యను ఎన్నుకున్నారని తెలిపారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల డాక్టర్ రమణయ్య అవగాహన కల్పించారు. అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనాథ్, కోశాధికారి హజరత్తయ్య, ఉపాధ్యక్షులు వీరేంద్రనాథ్, ఖాసిం, సంయుక్త కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



మాట్లాడుతున్న తిరుమలేశ్వరరెడ్డి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత ఎన్నికలే లక్ష్యమని.. ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా భరోసా కల్పించాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీస్ అధికారులతో మంగళవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేషన్ల వారీగా కేసులను సమీక్షించడంతో పాటు సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశనం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఫలితాల వెల్లడి వరకు ఎన్నికల కమిషన్‌కు లోబడి నిష్పక్షపాతంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. సాయుధ బలగాలతో కవాతును నిర్వహించి.. ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. గ్రామ సందర్శనను నిర్వహించి రాజకీయ నాయకులు, గ్రామపెద్ద లు, ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించాలని కోరారు. రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లో ఉన్న వారి బైండోవర్లతో పాటు లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేయాలన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లను అమలు చేయాలని.. మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణా కట్టడికి చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలను ముమ్మరం చేయాలని చెప్పారు. రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. తీవ్ర నేరాల్లో ఉన్న వారిపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు విచారణలో ఉన్న నిందితులకు శిక్ష పడేలా చూడాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను ముమ్మరం చేయడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. అనంతరం దర్యాప్తులో ప్రతిభ కనబర్చి.. కేసుల పెండెన్సీని తగ్గించి.. నేరాలను కట్టడి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసపత్రాలను అందజేశారు. ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా గిరిప్రదక్షిణ

- గోవింద నామస్మరణతో మార్మోగిన బిలకూట క్షేత్రం
- అశేషంగా తరలివచ్చిన భక్తజనం

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ప్రారంభ సూచికగా గిరిప్రదక్షిణను శాస్త్రోక్తంగా మంగళవారం నిర్వహించారు. అరుణాచలం తరహాలో గిరిప్రదక్షిణ సంప్రదాయాన్ని ఇక్కడ ఏడేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రసన్నుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆలయ అర్చకులు, వేదపండితులు వేకువజామున నిర్వహించారు. వేదపండితుల వేద నాదం.. మంగళవాయిద్యాలు, గోవింద నామ స్మరణల నడుమ స్వామివారు కొండ నుంచి కిందికి వచ్చారు. నిలువెత్తు స్వామివారి చిద్విలాస చిత్రపటంతో శ్రీహరి నామాలను కీర్తిస్తూ భక్తులు కొండచుట్టూ ప్రదక్షిణ చేశారు. గోవింద నామస్మరణలు, అన్నమయ్య కీర్తనలు, కోలాట ప్రదర్శనల నడుమ కార్యక్రమం భక్తి పారవశ్యంతో సాగింది. ఆర్డీఓ శీనానాయక్, ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఈఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.



కనులపండువగా ప్రసన్నుడి గిరిప్రదక్షిణ

ప్రజలతోనే సీఎంకు పొత్తు



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ప్రజలతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పొత్తు అని.. మతతత్వ పార్టీలతో పొత్తు ఎట్టి పరిస్థితుల్లో ఉండబోదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్రంతో సఖ్యతగా ఉంటామని.. రాజకీయాల కోసం కాదని గతంలో ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన సభలో సీఎం ప్రకటించారని చెప్పారు. ఇదే మాటపై ఉంటూ ఒంటరిగానే ఎన్నికల రణరంగంలోకి దిగుతున్నామని వెల్లడించారు. తమది లౌకికవాద పార్టీ అని మంత్రి పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఏ గడ్డినైనా కరిచే నైజం చంద్రబాబుదని విమర్శించారు. 2019లో బీజేపీని నానా మాటలన్న ఆయన ఇప్పుడు ప్రధానిని భుజాలపై మోస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలను ఎలాగైనా మోసం చేసి బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారని విమర్శించారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలపై నోటికొచ్చినట్లు మాట్లాడిన చంద్రబాబు ఇప్పుడు వీటిని కొనసాగిస్తామని ప్రకటించడం చూస్తే ఆయన రాజకీయ నైజం ఏమిటో అర్థమవుతోందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమని, ప్రజలు తమ పక్షానే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.

అసెంబ్లీ గేటును కూడా సోమిరెడ్డి తాకలేరు

పగటి కలలు కంటున్న టీడీపీ నేత సోమిరెడ్డి.. ఈసారి అసెంబ్లీలోకి అడుగుపెడతానని ప్రచారం చేసుకుంటున్నారని, అయితే దాని గేటును సైతం తాకలేరని మంత్రి ధ్వజమెత్తారు. కిరాయి, చందాల కోసం రాజకీయాలు చేసే సోమిరెడ్డికి టికెట్‌ను టీడీపీ ఇప్పటికీ ఇవ్వలేదని చెప్పారు. సర్వేలు చేయించి సోమిరెడ్డి ఎట్టి పరిస్థితుల్లో గెలవడని తెల్చుకొని ఇప్పటికి నలుగుర్ని రంగంలోకి దించాలని యత్నించి విఫలమైందని తెలిపారు. సైదాపురం మండలంలో మైనింగ్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. చందాల కోసం పోర్టు యాజమాన్యం వద్దకెళ్తే వారు మెడపట్టి గెంటేసిన అంశాన్ని గుర్తుచేశారు. తనకు.. సోమిరెడ్డికి మధ్య 25 శాతం ఓట్ల తేడా వస్తోందనే అంశాన్ని అన్ని సర్వేలు వెల్లడిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీకల్యాణి, సర్పంచ్ చిట్టెమ్మ, భారతి, లచ్చారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు లావాదేవీలపై నివేదిక ఇవ్వండి



మాట్లాడుతున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్
- బ్యాంక్ అధికారులతో సమావేశం



హాజరైన బ్యాంక్ అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల నేపథ్యంలో భారీ మొత్తంలో నగదు లావాదేవీలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ పేర్కొన్నారు. ఎన్నికలను పురస్కరించుకొని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బ్యాంక్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసిన నాటి నుంచి వారి ఖాతాలను తరచూ పరిశీలించాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కొత్త ఖాతాలను ప్రారంభించాలన్నారు. లక్ష, ఆపై బ్యాంకుల్లో జరిగిన లావాదేవీలపై జిల్లా ఎన్నికల అధికారికి నివేదికలను ఇవ్వాలని సూచించారు. ఒకే ఖాతా నుంచి నగదు లావాదేవీలు పలు మార్లు జరిగితే వాటిపైనా దృష్టి సారించాలన్నారు. బ్యాంకుల నుంచి ఏటీఎం కేంద్రాలకు రవాణా చేసే నగదు వాహనాలకు క్యూఆర్ కోడ్‌ను ఇవ్వాలన్నారు. అనుమానాస్పద లావాదేవీలపై అధికారులు రోజూ నివేదికలను సమర్పించాలని సూచించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రదీప్, ఎన్నికల ఖర్చు మానిటరింగ్ నోడల్ ఆఫీసర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన

జిల్లాకు కొత్తగా వచ్చిన ఈవీఎంలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ పరిశీలించారు. నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎంల గొడౌన్ వద్దకు కొత్తగా చేరిన కంట్రోల్ యూనిట్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలను పూర్తిస్థాయిలో పోలింగ్‌కు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎలాంటి సాంకేతిక లోపాల్లేకుండా చూడాలని ఇంజినీర్లకు సూచించారు. ఈవీఎంల నోడల్ అధికారి పద్మాదేవి, ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు చర్యలు

రాజకీయ పార్టీల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వలంటీర్లు, ప్రభుత్వంలో పనిచేసే వారిపై ఎన్నికల నిబంధనల మేరకు తగు చర్యలు చేపడతామని కలెక్టర్ హరినారాయణన్ హెచ్చరించారు. ప్రభుత్వంలో పనిచేసే వారు రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొంటున్నారని వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలపై కలెక్టర్ స్పందించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వలంటీర్లు, ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైతే కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. అసలే ఇరుకు రోడ్లు.. ఆపై రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్య సమస్యను మరింత జటిలం చేస్తోంది. స్టోన్‌హౌస్‌పేట ప్రధాన రహదారి ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకొని సాక్షి కెమెరాకు మంగళవారం కంటపడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



క్లుప్తంగా

కలెక్టర్లతో ఈసీ వీడియో కాన్ఫరెన్స్



హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై కేసు నమోదు చేయాలని, సీ విజిల్ ఆన్‌లైన్ పోర్టల్ ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. నెల్లూరులోని తన కార్యాలయం నుంచి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈసీ నిబంధనల మేరకు కోడ్ ఉల్లంఘనులపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. పబ్లిక్ ప్రదేశాల్లో అభ్యర్థుల హోర్డింగ్‌లను తొలగిస్తున్నట్లు వెల్లడించారు.

కోడ్‌ను పక్కాగా అమలు చేస్తాం

- జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు



పరిశీలిస్తున్న సీఈఓ కన్నమనాయుడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేస్తామని జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు తెలిపారు. పట్టణంలో కోడ్ అమ లు జరుగుతుందా? లేదా? అని తెలుసుకునేందుకు మంగళవారం ఆయన పర్యటించారు. విగ్రహాలకు ముసుగులు వేయించారు. ఫ్లెక్సీలు తీయించి వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి ఫిర్యాదులున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

గుడ్లూరు: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను మోటార్‌బైక్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గుడ్లూరు – తెట్టు ప్రధాన రహదారిలో రాళ్లవాగు వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పోట్లూరు గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన పోట్లూరు ముసలయ్య (40), చలంచర్ల రమణయ్య మోటార్‌బైక్‌పై గుడ్లూరుకు వచ్చారు. పని ముగిశాక తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. చెమిడిదిపాడు దాటి రాళ్లవాగు వద్దకు వచ్చేసరికి రోడ్డు పక్క నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ అదుపుతప్పి వేగంగా ఢీకొంది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌లో కావలికి తరలిస్తుండగా ముసలయ్య మృతిచెందాడు. రమణయ్యను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలో? మరే ఇతర కారణమో తెలియదు గానీ ఓ వ్యక్తి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. సంతపేట కటారిపాళేనికి చెందిన చిన్నా (35) నవాబుపేట కుసుమ దళితవాడకు చెందిన భవానీ తొమ్మిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. చిన్నా భార్యతో కలిసి కుసుమ దళితవాడలోనే ఉంటున్నారు. వారికి కుమార్తె, కుమారుడు సంతానం. అతను పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోసాగాడు. ఇటీవల దంపతుల నడుమ విభేదాలు చోటుచేసుకున్నాయి. తరచూ గొడవపడేవారు. ఈ విషయమై చిన్నా తన సోదరి ఈ.కామాక్షమ్మకు చెప్పి బాధపడుతుండేవాడు. భర్తతో గొడవపడి ఆరురోజుల క్రితం భవానీ ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో అతను మనస్తాపానికి గురై ఈనెల 18వ తేదీ రాత్రి తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన అత్త ఎ.కామాక్షి స్థానికుల సహకారంతో అతడిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నా మృతిచెందాడని నిర్ధారించారు. దీంతో జరిగిన విషయాన్ని ఆమె మృతుడి సోదరి కామాక్షమ్మకు తెలియజేసింది. కాగా కామాక్షి మంగళవారం ఉదయం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల వేళ.. అంతా అప్రమత్తం

గీత దాటితే వేటే..

- నగదు విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- రసీదు ఎంతో ముఖ్యం
- ఈసీ నిబంధనలు అందరూ పాటించాలి



నెల్లూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నగరా మోగింది. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పర్యవేక్షణలో పోలీసు యంత్రాగం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 2,470 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి 420కు పైగా క్రిటికల్‌గా ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ఇప్పటికే..

రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లో వారిని బైండోవర్ చేశారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల వేళ మద్యం, నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ఇతర వస్తువులను నియంత్రించేందుకు జిల్లా వ్యాప్తంగా 15 ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. వెంకటాచలం, ముసునూరు, బుచ్చిరెడ్డిపాళెం, డీసీపల్లి టోల్‌ప్లాజాల వద్ద ఇప్పటికే నిఘా పెట్టి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసులతోపాటు కేంద్ర బలగాలు ఎన్నికల బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నాయి. అందులో భాగంగా ఇప్పటికే మూడు బీఎస్ఎఫ్ బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. వాటిని నెల్లూరు, నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాలకు కేటాయించారు. స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. రక్షణగా మేమున్నాం.. స్వేచ్ఛగా ఓటు వేయండనే సంకేతంతో ఓటర్లలో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. మరికొన్ని బలగాలు త్వరలో రానున్నాయి.



తనిఖీల్లో పాల్గొన్న అధికారి, పోలీసులు

రసీదు ఉండాలి

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నగదు రవాణాపై నిఘా పెరిగింది. మద్యం, నగదు, ఇతర వస్తువులతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉండటంతో పోలీసు అధికారులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ పార్టీల నేతలు రూ.50 వేలకు మించి నగదు, రూ.10 వేలకు మించి విలువైన వస్తువులు రవాణా చేయడం నిషేధం. పార్టీల స్టార్ క్యాంపెయినర్ల వద్ద రూ.లక్షకు మించి నగదు ఉండరాదు. పౌరులు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే అందుకు తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఉద్యోగులు, కార్మికులు, కూలీలకు సంబంధించిన నగదు తీసుకెళ్లాలంటే వారి జాబితా, బ్యాంక్ నుంచి డ్రా చేసిన రసీదు వివరాలు ఉండాలి. ఆస్పత్రులకు చెల్లించేందుకు డబ్బు తీసుకెళ్లాలంటే రోగి తాలూకా వివరాలు తప్పనిసరి. రైతులు వ్యవసాయంకు సంబంధించిన వస్తువులు కొనుగోలుకు వెళ్తుంటే వ్యాపార సంస్థల నుంచి ఇన్‌వాయిస్ లేదా కొటేషన్స్ తీసుకుంటే మేలు. భూములు, స్థలాలకు సంబంధించిన లావాదేవీలైతే దస్తావేజులు, ఇతర ధ్రువీకరణపత్రాలు ఉంచుకోవాలి. పరిమితికి మించి నగదు తీసుకెళ్తే నగదుతోపాటు వాహనాలను సీజ్ చేస్తారు.

అనుమతి తీసుకోవాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ పాటించాల్సిందే. ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సమావేశాలు, ర్యాలీలు, భారీ స్పీకర్ల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. విభేదాలు, వైషమ్యాలు, కుల, మత, జాతుల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టరాదు. రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, అభ్యర్థులు మసీదు, చర్చి, ఆలయాల వద్ద ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం వంటివి చేయకూడదు. అనుమతి లేకుండా బ్యానర్లను కట్టడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లను అతికించడం చేయరాదు. ఎన్నికల ప్రచారానికి వినియోగించే ప్రతి వాహనానికి అనుమతి తీసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పనిచేయాలి. రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

కాలువలో వ్యక్తి మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ నారాయణ

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో కాలువలో పడటం వల్లో.. లేక ఇతర కారణమో తెలియదు గానీ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నెల్లూరు ఉమ్మారెడ్డిగుంటలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటకు చెందిన మల్లికార్జున (52), సుజాత దంపతులకు వెంకటసాయిగిరి, నాగేంద్ర అనే పిల్లలున్నారు. వారి చిన్నతనంలోనే సుజాత మృతిచెందారు. అప్పటి నుంచి మల్లికార్జున పిల్లల్ని పెంచి పెద్ద చేశాడు. కొంతకాలంగా మల్లికార్జున మద్యానికి బానిసయ్యాడు. పిల్లల్ని పట్టించుకోవడం మానేశాడు. అతిగా తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని కుమారులు పలుమార్లు చెప్పినా ఆయన పెడచెవిన పెట్టాడు. మంగళవారం ఉమ్మారెడ్డిగుంటలోని రవీంద్ర నగర్ నాలుగోవీధి ఎదురుగా ఉన్న మురికి కాలువలో చనిపోయి ఉండడాన్ని స్థానికులు గమనించి వెంకటసాయిగిరికి సమాచారం అందించారు. మల్లికార్జున కాళ్లు మాత్రమే బయటకు ఉండి శరీరం మొత్తం కాలువలో ఉంది. దీంతో కుమారుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతిగా మద్యం తాగి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రారండోయ్ రంగడి బ్రహ్మోత్సవాలు చూద్దాం



విద్యుద్దీపాలంకరణలో రంగడి ఆలయం

- నేడు అంకురార్పణ
- 25న బంగారు గరుడసేవ
- 26న కల్యాణం, 27న రథోత్సవం, 31న తెప్పోత్సవం




ఆలయం లోపల ఇలా..

నెల్లూరు(బృందావనం): సింహపురి క్షేత్రపాలకుడిగా పవిత్ర పినాకినీ తీరాన కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రంగనాథుడి ఆలయం ఉత్తర శ్రీరంగంగా భాసిల్లుతోంది. బ్రహ్మోత్సవాలను నయనానందకరంగా నిర్వహించేందుకు యంత్రాంగం సమాయత్తమైంది. ఆలయం, పరిసరాలు, మాడవీధుల్లో స్వామి, దేవతామూర్తుల చిత్రాలను, తూర్పున ఉన్న రాజగోపురాన్ని, మండపాలను, విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామి ఉభయదేవేరులతో కొలువుదీరి విశేషంగా తరలివచ్చే భక్తజనానికి దర్శనమివ్వనున్నారు. భక్తుల కోసం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికార యంత్రాంగం సమన్వయంతో విస్తృతంగా ఏర్పాట్లు చేశాయి.

రోజూ ఇలా..

బుధవారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. 21న ఉదయం 4 నుంచి 8 గంటల్లోగా ధ్వజారోహణం (తిరుచ్చి), రాత్రి 9గంటలకు శేషవాహన అలంకారోత్సవం, 22న ఉదయం 8 గంటలకు సూర్యప్రభ, రాత్రి 9 గంటలకు హంసవాహన అలంకారోత్సం, 23న ఉదయం 8 గంటలకు సింహవాహన, రాత్రి 9 గంటలకు చంద్రప్రభ అలంకారోత్సవం, 24న ఉదయం 8 గంటలకు పల్లకి, రాత్రి 9 గంటలకు హనుమంతసేవ అలంకారోత్సవం, 25న ఉదయం 8 గంటలకు మోహిని అవతారం, సాయంత్రం 4 గంటలకు పూలంగిసేవ, రాత్రి 10 గంటలకు బంగారు గరుడసేవ, 26న సాయంత్రం 4 గంటలకు పూలంగిసేవ, రాత్రి 7 గంటలకు కల్యాణోత్సవం, అర్ధరాత్రి ఒంటి గంటకు గజవాహన సేవ అలంకారోత్సవం, 27న ఉదయం 8.30 గంటలకు రథోత్సవం, స్వామి, అమ్మవార్లకు పుష్పాలంకరణ, ప్రసన్న వేంకటేశ్వరస్వామికి రాత్రి 8 గంటలకు పొన్న వాహనోత్సవం, 28న రాత్రి 7 గంటలకు అశ్వవాహన అలంకారోత్సవం, 29న ఉదయం 8 గంటలకు ప్రణయ కలహోత్సవం, చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు పుణ్యకోటి విమానం, 30న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం, రాత్రి 8 గంటలకు దవనోత్సవ, రాత్రి 11 గంటలకు ధ్వజావరోహణం, 31న రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.75
సన్నవి	రూ.70
పండ్లు	రూ.25

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 118
లేయర్ (లైవ్) : 73
బ్రాయిలర్ చికెన్ : 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 234
లేయర్ చికెన్ : 125

పోలింగ్ కేంద్రాలకు పక్కాగా విద్యుత్ సరఫరా

- ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు



మాట్లాడుతున్న సుబ్బరాజు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పక్కాగా విద్యుత్ సరఫరా జరుగుతోందని నిర్ధారించామని, ఇంకా ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తామని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) ఎన్‌వీఎస్ సుబ్బరాజు తెలిపారు. నెల్లూరు టౌన్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి పెండింగ్ బకాయిలపై నోటీసులిచ్చి వసూళ్లు చేపట్టాలని ఆదేశించారు. టౌన్ డివిజన్‌లో 12 సెక్షన్లు ఉన్నాయని అధికారులు ప్రతినెలా ఒక ఇంప్రూవ్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఆయా సెక్షన్ ఆఫీసర్లపై ఉందన్నారు. నిర్ణీత గడువులోగా డీ లిస్టు ప్రక్రియను పూర్తి చేసి రెవెన్యూ కార్యాలయాలకు పంపాలని సూచించారు. కొంతమంది అధికారులు వర్క్ ఆర్డర్స్ క్లోజ్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారి వ్యక్తిగత బ్యాంకు అకౌంట్ నుంచి నగదు వసూలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఎస్ఈ వి.విజయన్, నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, డీఈఈలు మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్, కిరణ్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

భర్తను కడతేర్చిన భార్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కోవూరు: భర్తను భార్య రోకలి బండతో కొట్టి చంపిన ఘటన కోవూరులోని బండారుమాన్యంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పి.అయ్యప్ప (42) అనే వ్యక్తి ఫ్లెక్సీలు కడుతుంటాడు. చిన్నచిన్న పనులు చేస్తుంటాడు. అతడికి దుర్గ అనే మహిళతో వివాహమైంది. వారికి పదేళ్ల వయసున్న బాలుడు, ఐదేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. అయ్యప్ప రాజేశ్వరి అనే మహిళతో సన్నిహితంగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఆమె, అతను కలిసి మద్యం తాగారు. తర్వాత అయ్యప్ప ఇంటికి రాగా భార్యాభర్తలిద్దరూ తాగారు. అయ్యప్పకు రాజేశ్వరితో వివాహేతర సంబంధం ఉందని దుర్గకు అనుమానం ఉంది. ఈ నేపథ్యంలో వారి మధ్య గొడవ జరిగింది. రాజేశ్వరిని ఇంటికి తీసుకురావాలని అయ్యప్ప అరిచి చెప్పడంతో దుర్గ వెళ్లి ఆమెను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా వారి మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. కాసేపటికి రాజేశ్వరి అక్కడి నుంచి వెళ్లిపోయింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అయ్యప్ప భార్యపై రోకలి బండతో దాడి చేయబోయాడు. ఆమె దానిని లాక్కొని భర్తను కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అయ్యప్ప సోదరుడు కోవూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, స్థానిక సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్ గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డీఎస్పీ చుట్టుపక్కల వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.